సాక్షి
ప్రకాశం
శుక్రవారం ¦ 11 ¦ ఏప్రిల్ ¦ 2025



ఈదురు గాలుల బీభత్సం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. వందల ఎకరాల్లో బొప్పాయి పంట నేలకొరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 8లో..



జగనన్నతోనే పేదలకు న్యాయం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదలకు న్యాయం జరుగుతుందని, వచ్చే ఎన్నికల్లో ఆయనను మళ్లీ సీఎంను చేసుకోవాలని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
37/27

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుంది.

న్యూస్‌రీల్

నేడు మహాత్మా జ్యోతీబాపూలే జయంతి

ఒంగోలు సబర్బన్: మహాత్మా జ్యోతీబాపూలే 199వ జయంతిని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. జిల్లా బీసీ సంక్షేమం–సాధికారత శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతీబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. అనంతరం 11 గంటలకు ప్రకాశం భవన్‌లోని స్పందన హాలులో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ వేడుకలకు ప్రతిఒక్కరూ హాజరుకావాలని కోరారు.

వెలిగొండకు కార్యాచరణ రూపొందించాలి



జలవనరుల శాఖ, ఆర్‌అండ్‌ఆర్ స్పెషల్ కలెక్టర్లతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి మిగిలిన పనులకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా అధికారులను ఆర్‌అండ్‌ఆర్, జలవనరుల శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశించారు. విజయవాడ నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక ప్రకాశం భవనం నుంచి జేసీ గోపాలకృష్ణ, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు సంబంధించిన పనులను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అందుకోసం పూర్తి స్థాయి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా 2026 జూలై నాటికి సాగు, తాగు నీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. స్టేజి–1కు సంబంధించి భూ సేకరణను ఏప్రిల్ మాసాంతానికి పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం అధికారులతో జేసీ సమీక్షించారు. ప్రాజెక్టు ప్రభావిత ముంపు గ్రామాల నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లింపు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలో సౌకర్యాల కల్పనను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జలవనరుల శాఖ ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజినీర్, భూ సేకరణ స్పెషల్ కలెక్టర్, ప్రాజెక్ట్స్ సూపరింటెండెంటింగ్ ఇంజినీరు, మార్కాపురం, కంభం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు (భూసేకరణ), మార్కాపురం, కంభం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించాలి

ఒంగోలు సబర్బన్: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం జేసీ గోపాలకృష్ణతో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పరిష్కారం కోసం వచ్చిన రెవెన్యూ సమస్యల వివరాలను, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై గ్రామాల వారీగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో, పీజీఆర్ఎస్‌లో వచ్చిన రెవెన్యూ అంశాలకు సంబంధించిన అర్జీల పరిష్కారంపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమస్య పరిష్కారం వీలుకాని పక్షంలో ఏ కారణం చేత పరిష్కారం వీలు కాదో సంబంధిత లబ్ధిదారునికి తెలియచేయాలని స్పష్టం చేశారు. రెగ్యులరైజేషన్ స్కీం–2025 ప్రక్రియపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, డీఆర్‌ఓ బి.చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు వడ్డీ రాయితీ పొడిగింపు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నుపై 50 శాతం వడ్డీ రాయితీకి గడువు తేదీని ఈ నెలాఖరు వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024–25 వరకు గల పన్ను బకాయిలను 30.04.2025లోపు ఏకమొత్తంగా చెల్లించి అపరాధ రుసుం (వడ్డీ) నుంచి 50 శాతం మినహాయింపు పొందే అవకాశాన్ని పన్ను బకాయిదారులకు ప్రభుత్వం కల్పించింది. పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు కోరారు. పన్నులు చెల్లించడానికి సమీపంలోని వార్డు సచివాలయాలలోగానీ, నగరపాలక సంస్థ కార్యాలయంలోగానీ సంప్రదించాలని సూచించారు.

గుండెకు వరం..

రెండేళ్ల కిందటే జీవం!

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపు జిల్లాలోని హృద్రోగులకు వరంగా మారుతోంది. సామాన్య ప్రజలకు అత్యున్నత వైద్యసేవలందించాలన్న లక్ష్యంలో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రికి క్యాథ్‌ల్యాబ్ మంజూరు చేశారు. ఆ సేవలు ప్రస్తుతం అందుబాటులోకి రానున్నాయి. క్యాథ్‌ల్యాబ్‌ను కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పనులు నత్తనడకన సాగాయి. పనులు పూర్తయినా ల్యాబ్ ప్రారంభానికి నాలుగు నెలలు పట్టింది. తొలుత అట్టహాసంగా ప్రారంభించాలని ప్లాన్ చేశారు. అయితే, వైఎస్సార్ సీపీకి ఎక్కడ మంచి పేరు వస్తుందోనని తాత్సారం చేస్తూ వచ్చారు. ఎట్టకేలకు శుక్రవారం వైద్యశాఖామంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఇక్కడ నలుగురు కార్డియాలజిస్టులకు ఒక్కరే ఉన్నారు.



- వైఎస్సార్ సీపీ హయాంలోనే తొలి అడుగు
- 2023లోనే ఒంగోలు జీజీహెచ్‌కి క్యాథ్‌ల్యాబ్ మంజూరు చేసిన అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- అప్పట్లోనే టెక్నీషియన్లు, నర్సింగ్ స్టాఫ్‌కు శిక్షణ
- కూటమి ప్రభుత్వ హయాంలో నత్తనడకన పనులు
- జనవరికి పూర్తయిన పనులు.. నేడు ప్రారంభం
- 4 కార్డియాలజీ పోస్టులకు ఒక్కరితోనే సరి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు

జిల్లా కేంద్రం ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి వచ్చిన పీజీ ఫండ్స్‌తో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. 2023వ సంవత్సరం డిసెంబర్‌లో టెండర్ పిలిచారు. 6 కోట్ల రూపాయలకుపైగా నిధులు కేటాయించారు. జీజీహెచ్ మొదటి అంతస్తు రూం నంబర్ 120లో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటుకు 2024 జనవరి నుంచి పనులు చేపట్టారు. మార్చి నుంచి ఆగస్టు వరకు సివిల్ పనులు పూర్తి చేశారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఎలక్ట్రికల్ పనులు పూర్తి చేసి ఆ తర్వాత నవంబర్ నాటికి మిషన్ బిగించారు. ఎన్నికల కోడ్ రావడంతో మిగిలిన ప్యాచ్ వర్క్ ఆగింది. ఆ తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో అక్కడి నుంచి పనులు నత్తను తలపించాయి.

శానిటేషన్, ఐసీసీయూ పనులను జనవరి 25 నాటికి పూర్తి చేశారు. అప్పటి నుంచి జీజీహెచ్‌లో యాంజియోగ్రామ్ పరీక్షలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 51 మందికి పరీక్షలు చేసి స్టెంట్లు అవసరమైన వారిని గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు.

క్యాథ్‌ల్యాబ్ వినియోగంపై శిక్షణ...

ఒక వైపు క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటుకు చకచకా పనులు జరుగుతుండగానే.. మరోవైపు వైద్య సిబ్బందికి తగిన శిక్షణ ఇప్పించారు. క్యాథ్‌ల్యాబ్ వినియోగం గురించి ఇద్దరు క్యాథ్‌ల్యాబ్ టెక్నీషియన్లు, 8 మంది నర్సింగ్ స్టాఫ్‌కు గుంటూరు జీజీహెచ్‌లో విడతల వారీగా శిక్షణ ఇచ్చారు. నెల రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణలో క్యాథ్‌ల్యాబ్ వినియోగం గురించి సుశిక్షితులైన వైద్య సిబ్బందిచే శిక్షణ ఇప్పించారు. యాంజియోగ్రామ్, స్టెంట్ల గురించి అవగాహన కల్పించారు. ఇదంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే జరిగింది.

మంత్రి చేతుల మీదుగా ప్రారంభించాలని...

క్యాథ్‌ల్యాబ్ పనులు పూర్తయి నాలుగు నెలలు కావస్తోంది. తొలుత అట్టహాసంగా ప్రారంభించాలని ప్లాన్ చేశారు. అయితే వైఎస్సార్ సీపీ హయాంలోనే క్యాథ్‌ల్యాబ్ మంజూరైంది కనుక ఇప్పుడు కూటమి పాలకులు ప్రారంభించినా క్రెడిట్ వైఎస్సార్ సీపీకి దక్కుతుందని భావించి సాదాసీదాగా ప్రారంభించుకోవాలని అధికార పార్టీకి చెందిన ఒక కీలక ఎమ్మెల్యే అధికారులను ఆదేశించినట్లు సమాచారం . అంతేగాకుండా ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ బీజేపీ తరఫున ధర్మవరం నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఇటీవల కాలంలో ఆయనకు – టీడీపీ నాయకులకు పొసగడం లేదు. ఇదిలా ఉండగా ఇటీవల ఒంగోలు మండలంలోని ఏడుగుండ్లపాడులో క్యాన్సర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్ ఉదయం 10.30 గంటలకు వచ్చారు. సభా కార్యక్రమం ప్రారంభమై పూర్తయ్యే సమయానికి మధ్యాహ్నం 1.30 సమయంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరయ్యారు. దాంతో వేదిక మీద నుంచే ఎమ్మెల్యేకు ఇప్పుడు తెల్లారిందని మంత్రి వ్యాఖ్యానించడం గమనార్హం. దీంతో ఎమ్మెల్యే ఫీలైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా జరిగే కార్యక్రమం పట్ల స్థానిక టీడీపీ పెద్దగా ఆసక్తి చూపడం లేదని ప్రచారం జరుగుతోంది.




ఒక్క కార్డియాలజిస్టుతోనే సరి...

వాస్తవానికి జీజీహెచ్‌లో నాలుగు కార్డియాలజిస్ట్ పోస్టులున్నాయి. ప్రస్తుతానికి ఒకేఒక్క కార్డియాలజిస్టు మాత్రమే ఉన్నారు. రోజుకు 50 నుంచి 70 వరకు కార్డియాలజీ ఓపీ ఉంటుంది. క్యాథ్‌ల్యాబ్ ప్రారంభమైతే ఈ సంఖ్య రెట్టింపవడం ఖాయం. కార్డియాలజిస్టు మీద పనిభారం పెరిగే అవకాశం ఉంది. కార్డియాలజిస్టు పోస్టులను భర్తీ చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలున్నాయి. బైపాస్ ఆపరేషన్లు, స్టెంట్లు వేసిన తర్వాత కొంతమందికి కిడ్నీలు దెబ్బతింటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే ఇక్కడ నెఫ్రాలజిస్టు పోస్టులు మూడింటికిగానూ ఒక్కరే ఉన్నారు. వైద్య పరికరాలు లేకపోవడంతో ఆయన కూడా ఊరికే కూర్చుంటున్నారని తెలుస్తోంది.

ఉచితంగా ఖరీదైన టెనెక్ట్ ప్లస్ ఇంజక్షన్లు...

గుండెజబ్బుల బారిన పడిన వారికి తొలి గంట, రెండు గంటల్లోపు వైద్యం చేయడం చాలా అవసరం. అప్పుడే వారి ప్రాణాలు కాపాడగలిగే అవకాశాలుంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఎస్టీ ఎలివేషన్ మయోకార్డియో ఇన్‌ఫ్రాక్షన్ (స్టెమీ) అనే కార్యక్రమాన్ని 2023వ సంవత్సరంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రాథమిక వైద్యశాలలు (పీహెచ్‌సీ), కమ్యూనిటీ హెల్త్ కేర్ సెంటర్ (సీహెచ్‌సీ), ఏరియా వైద్యశాలలు, జిల్లా వైద్యశాలల్లో టెనెక్ట్ ప్లస్ అనే ఇంజక్షన్‌ను అందుబాటులో ఉంచింది. దీని ఖరీదు సుమారు రూ.40 వేల వరకు ఉంటుంది. దీనిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభిస్తే.. ఇప్పుడే కొత్తగా ప్రారంభించినట్లు కూటమి ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం గమనార్హం.



బీసీ రుణాలు.. భారీ పైరవీలు

- బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరులో కూటమి నేతల మితిమీరిన జోక్యం
- తాము చెప్పిన వారికే రుణాలివ్వాలంటూ పెద్ద ఎత్తున సిఫార్సులు
- అధికారులపై ఒత్తిడితో నష్టపోనున్న అర్హులు
- నేడు యూనిట్ల గ్రౌండింగ్



బీసీ కార్పొరేషన్ కార్యాలయం

ఒంగోలు వన్‌టౌన్:

అవినీతి, అక్రమాలకు పాల్పడేందుకు ఏ ఒక్క అవకాశాన్నీ కూటమి పార్టీల నాయకులు వదలడం లేదు. చివరకు బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి సబ్సిడీపై రుణాల మంజూరులో కూడా జోక్యం చేసుకుంటున్నారు. నియమ నిబంధనలు పూర్తిగా పక్కనపెట్టి తాము చెప్పిన వారికే రుణాలు మంజూరు చేయాలంటూ అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. నాయకుల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు.. సిఫార్సులు, పైరవీలకే పెద్దపీట వేసేందుకు సిద్ధమయ్యారు.

వేల సంఖ్యలో దరఖాస్తులు...

బీసీ కార్పొరేషన్ రుణాల కోసం వేల సంఖ్యలో ఆశావాహులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ, పారదర్శకంగా వ్యవహరించి అర్హులకు రుణాలు మంజూరు చేయాల్సిన అధికారులు.. నాయకుల సిఫార్సులకే పెద్ద పీట వేస్తున్నారు. అలాంటి వారికే రుణాలు మంజూరు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మండలాల వారీగా ఎవరెవరికి రుణాలు మంజూరు చేయాలో ముందుగానే అధికారులకు కూటమి నాయకులు జాబితా అందజేశారు. మహాత్మా జ్యోతీరావుపూలే జయంతి సందర్భంగా నేడు వారికి సంబంధించిన రుణాల యూనిట్లను అధికారులు గ్రౌండింగ్ చేయనున్నారు. దీనివలన అర్హతల్లో ముందంజలో ఉన్నవారికి అన్యాయం జరగనుంది.

నిరుద్యోగ యువతకు నిరాశ...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలైనప్పటికీ నిరుద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల గురించి పట్టించుకోలేదు. దీంతో నిరుద్యోగం పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాల కోసం భారీగా నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. రుణం మంజూరైతే ఏదైనా స్వయం ఉపాధి పొందవచ్చని భావించారు. కానీ, టీడీపీ నాయకుల సిఫార్సులు ఉంటేనే రుణాలు మంజూరవుతున్నాయని తెలిసి తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

రూ.15.13 కోట్లతో 607 యూనిట్లకు నేడు గ్రౌండింగ్...

బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ సబ్సిడీతో రుణాలు మంజూరు చేసేందుకు మొత్తం 143 రకాల యూనిట్లకు దరఖాస్తులు స్వీకరించారు. బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కులాలకు సంబంధించి రూ.49.65 కోట్ల రుణాలను 2069 యూనిట్లను గ్రౌండింగ్ చేయాల్సి ఉండగా, ప్రస్తుతం బీసీ–491, ఈడబ్ల్యూఎస్ 148, కాపులు–40 చొప్పున కేవలం 607 యూనిట్లను రూ.15.13 కోట్లతో మంజూరు చేస్తున్నారు. వాటిని కూడా పైరవీదారులకే కేటాయించేందుకు రంగం సిద్ధం చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికే మండల స్థాయిలో ఎంపీడీఓ, బ్యాంకర్లు తూతూమంత్రంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. కుల సంఘాల నాయకులతో సమావేశాలు నిర్వహించినప్పటికీ వారంతా టీడీపీకి చెందిన బీసీ నాయకులే కావడంతో వారిచ్చిన జాబితానే ఫైనల్ చేశారు. ఎక్కువ భాగం అనర్హులనే రుణాలకు ఎంపిక చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

రాజకీయ జోక్యం లేదు

బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై స్వయం ఉపాధి రుణాల మంజూరుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఎటువంటి రాజకీయ జోక్యం లేదు. పారదర్శకంగా వ్యవహరిస్తూ అర్హులనే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నాం.
– ఎం.వెంకటేశ్వరరావు, బీసీ కార్పొరేషన్ అధికారి

రాజకీయ పలుకుబడి ఉన్నవారికే రుణాలు

గత వైఎస్సార్ సీపీ హయాంలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో అటువంటి పరిస్థితులు కనిపించడం లేదు. రాజకీయ పలుకుబడి ఉన్నవారినే బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారు.
– కఠారి శంకరరావు, అఖిల భారత యాదవ మహాసభ నాయకుడు

ఫోన్ పే కొట్టు.. పదోన్నతులు పట్టు..!

- నర్సింగ్ ఉద్యోగోన్నతుల్లో అక్రమాలు
- భారీగా నగదు చేతులు మారినట్లు ఆరోపణలు
- 8 మంది సీనియార్టీని మార్చినట్లు జేసీకి ఫిర్యాదు
- మాలమహానాడు ఫిర్యాదుతో విచారణకు ఆదేశం
- నేడు వైద్యారోగ్యశాఖ మంత్రికి ఫిర్యాదు చేయనున్న మాలమహానాడు నేతలు

ఒంగోలు టౌన్: జిల్లా వైద్యారోగ్యశాఖకు అవినీతి రోగం పట్టుకుంది. డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో అక్రమాలు జరుగుతున్నాయంటూ తరచూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. అధికారులు మారినా అక్కడి తీరు మారడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలోని వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న సచివాలయ ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతులు, భారీగా బదిలీలు జరిగాయి. ఈ సందర్భంగా పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్చి 17వ తేదీ జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో నర్సింగ్ సిబ్బందికి ఉద్యోగోన్నతులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లాలోని 212 మంది ఏఎన్‌ఎంలకు గ్రేడ్–3 పదోన్నతి కల్పించగా, 210 మంది కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. ఒక్కొక్కరి వద్ద నుంచి డబ్బు వసూలు చేసినట్లు సమాచారం. ఇందుకుగానూ ఏరియాలవారీగా కొంతమందిని నియమించుకుని ఉద్యోగుల ద్వారా ఫోన్ పే చేయించుకున్నట్లు తెలుస్తోంది. డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో కౌన్సిలింగ్ జరుగుతున్న సమయంలో కూడా కొంతమంది దగ్గర నుంచి ఫోన్ పే చేయించుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఓ కారు డ్రైవర్, మరో నలుగురు ఉద్యోగులు కీలక పాత్ర పోషించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

సీనియార్టీలో మార్పులు చేశారా..?

జిల్లాలో 210 మంది ఏఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతి కల్పించడానికిగానూ జిల్లా సెలక్షన్ కమిటీ సీనియార్టీ లిస్టు తయారు చేసిందని సమాచారం. ఈ లిస్టులో 8 మంది పేర్లను కీలక అధికారి తన ఇష్టమొచ్చినట్లు మార్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ మొత్తంలో డబ్బు తీసుకుని అనర్హులకు సీనియార్టీ ఇవ్వడం వల్ల తమకు అన్యాయం జరిగిందని కొంతమంది ఏఎన్‌ఎంలు వాపోతున్నారు.

నచ్చిన చోట పోస్టింగ్...

కొంతమంది సిబ్బందికి కోరుకున్న చోట పోస్టింగులిచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకుగానూ ఒక్కొక్కరి నుంచి లక్ష రూపాయల వరకు వసూలు చేసినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. కొండపి నియోజకవర్గానికి చెందిన ఒక ఏఎన్‌ఎంను జిల్లా కేంద్రానికి సమీపంలో పోస్టింగు ఇవ్వాలని మంత్రి సిఫార్సు చేసినట్లు చెప్పుకుంటున్నారు. ఉద్యోగోన్నతుల్లో అవకతవకలు, బదిలీల విషయంలో జరిగిన అక్రమాలపై ఆంధ్రప్రదేశ్ మాలమహానాడు అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జేసీ.. సమగ్ర విచారణకు ఆదేశిస్తూ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎస్‌డీసీ మాధురిని ఆదేశించారు. ఉద్యోగుల మెరిట్ జాబితాకు సంబంధించిన ఫైళ్లను సిద్ధం చేయాలని సూచించారు. శుక్రవారం విచారణకు పిలిచిన ఆమె.. మంత్రి పర్యటన ఉండటంతో వాయిదా వేసినట్లు సమాచారం. ఇప్పటికే అవకతవకలు, అవినీతికి సంబంధించి కీలక సాక్ష్యాలు అధికారుల చేతికి అందినట్లు తెలుస్తోంది. డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు మాలమహానాడు అధ్యక్షుడు చెన్నయ్య తెలిపారు.

అగ్రహారం భూములపై రాబందులను వాలనివ్వం

- అర్హులైన పేదలకు ఆ భూములు పంచాల్సిందే
- ఒక్కొక్కరికి రెండు సెంట్ల చొప్పున ఇస్తామన్న హామీ నెరవేర్చకుంటే పోరాటం
- భూములను పరిశీలించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



కలెక్టరేట్ వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఒంగోలు టౌన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన అగ్రహారం భూముల్లో రాబందులను వాలనిచ్చేదిలేదని, అగ్రహారం భూములను కొల్లగొట్టాలని చూస్తే ఊరుకోమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టం చేశారు. ఒంగోలు నగరంలోని వేలాది మంది ఇళ్లులేని నిరుపేదలకు అగ్రహారం భూముల్లో ఇంటి స్థలాలిచ్చేంత వరకు ఎర్రజెండాలతో పోరాటాం కొనసాగిస్తామని చెప్పారు. గురువారం ఒంగోలు వచ్చిన ఆయన.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అగ్రహారం భూములను పార్టీ నాయకులు, లబ్ధిదారులతో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై మండిపడ్డారు. ఒంగోలులో 20 ఏళ్ల క్రితం ఇంటి స్థలాలు పంపిణీ చేశారని, ఇప్పటికీ ఒక్కో ఇంట్లో ఏడుగురు కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్నారని తెలిపారు. అద్దెలు కట్టలేక అల్లాడిపోతున్నారని చెప్పారు. ఏడేళ్ల క్రితం నిర్మించిన టిడ్కో ఇళ్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి పేదలకు అందజేయాలన్నారు. లేకపోతే టిడ్కో ఇళ్లపై ఉద్యమం చేస్తామని ప్రకటించారు.

అగ్రహారం భూములపై పేదలకే హక్కు...

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య ప్రసంగిస్తూ అగ్రహారం భూములపై పేదలకే హక్కుందన్నారు. అగ్రహారం భూములను కొల్లగొట్టాలని చూస్తే ఎర్రజెండాలు పాతి పేదలకు అండగా నిలుస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నప్పటికీ పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంలో విఫలమైందని విమర్శించారు. అగ్రహారం భూముల్లో భరోసా పత్రాలిచ్చిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి.. అధికారం పోగానే స్వలాభం కోసం పార్టీ మారారే తప్ప పేదలకు ఇచ్చిన భూముల గురించి పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఒంగోలులో పేదలకు ఇంటిస్థలాలు ఇచ్చేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, నాయకులు కె.వీరారెడ్డి, శ్రీరాం శ్రీనివాస్, ఆర్.వెంకటరావు, వడ్డే హనుమారెడ్డి, ఆర్.రామకృష్ణ, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఆర్.లక్ష్మి, ముత్తని అంజయ్య, ఎస్.మురళి, ఎం.విజయ, బాలకోటయ్య, ప్రభాకర్, గద్దల రవి తదితరులు పాల్గొన్నారు.

14న రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు

రాచర్ల: నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 14వ తేదీ రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేల్లో పాల్గొనేవారు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు మొదటి నాలుగు బహుమతులు వరుసగా రూ.లక్ష, రూ.70 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 95056 81744, 79974 74026, 99120 32442ను సంప్రదించాలని సూచించారు.

వివాదాస్పద భూమిలో జాయింట్ సర్వే

కురిచేడు: కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ కోసం రిలయన్స్ సంస్థకు కురిచేడు మండలంలోని గంగదొనకొండ రెవెన్యూ పరిధిలో భూ కేటాయింపుపై వివాదం తలెత్తిన నేపథ్యంలో అటవీ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా గురువారం సర్వే నిర్వహించాయి. కనిగిరి ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి, డీఎఫ్ఓ వినోద్‌కుమార్, సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసరావు, రేంజ్ అధికారి బి.నరసింహారావు సమక్షంలో సర్వేయర్లు ఆ భూములను కొలతలు వేసి హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. సర్వే కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు. హద్దులు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించే దిశగా సమష్టిగా పనిచేస్తున్నట్లు చెప్పారు. వీఆర్వో హనుమంతురావు, ఇన్‌చార్జి సర్వేయర్ గోపి, గ్రామ సర్వేయర్లు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నాట్య మయూరాలకు గిన్నిస్ సర్టిఫికెట్లు


గిన్నిస్ సర్టిఫికెట్లు, మెడల్స్‌తో చిన్నారులు

యర్రగొండపాలెం: భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 2023 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా నాట్య ప్రదర్శనలో స్థానిక శ్రీవెంకటేశ్వర భరత నాట్య అకాడమీకి చెందిన చిన్నారులు మందుల సాయి ఆహ్లాదిత, తాళ్లపల్లి నాగబాల నందిని, తాళ్లపల్లి నాగబాల వైష్ణవి, ఆముదం సిరిచందన, పిండి తేజస్విని పాల్గొన్నారు. ఈ నాట్య ప్రదర్శనకు గిన్నిస్ రికార్డులో చోటు దక్కింది. ఈ మేరకు గిన్నిస్ సర్టిఫికెట్లు, మెడల్స్‌ను గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు అందుకున్నారు. చిన్నారులను అకాడమీ నాట్య గురువు మందుల భారతి, వైస్ ఎంపీపీ ఆదిశేషు అభినందించారు.

విద్యుత్ డీఈ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అదృశ్యం

- సూసైడ్ నోట్ రాయడంతో కలకలం


రామకృష్ణారెడ్డి ఇంట్లో లభించిన సూసైడ్ నోట్

దర్శి(కురిచేడు): అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులు తాళలేక దర్శి విద్యుత్ డీఈ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఏకంగా సూసైడ్ నోట్ రాసి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన గురువారం వెలుగులోకి రాగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళి తెలిపారు. వివరాలు.. స్థానిక విద్యుత్ డీఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గూడపురెడ్డి రామకృష్ణారెడ్డి తన ఇంట్లో మరణ వాంగ్మూలంతోపాటు మరో కాగితంపై బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డుల వివరాలు, పాస్‌వర్డ్‌లు రాసిపెట్టి అదృశ్యమయ్యారు. నాలుగేళ్ల క్రితం హనుమంతునిపాడు మండలం మిట్టపాలెం గ్రామానికి చెందిన కందుల రాజశేఖరరెడ్డి వద్ద తీసుకున్న రూ.2 లక్షల అప్పునకు ప్రాంసరీ నోట్లు, సంతకం చేసిన ఖాళీ చెక్కు ఇచ్చాడు. ఇప్పటి వరకు రూ.1.50 లక్షలు చెల్లించగా రాజశేఖరరెడ్డి రూ.15 లక్షలకు చెక్ బౌన్స్ చేశాడు. ఈ కేసుపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. రాజశేఖరరెడ్డి తరచూ ఫోన్ చేసి బెదిరిస్తున్నాడని, మార్చి 12వ తేది ఉదయం వాకింగ్‌కు వెళ్లగా బలవంతంగా కారులో ఎక్కించుకుని చైను, ఉంగరం, సెల్‌ఫోన్ తీసుకున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. 'నా మరణానికి కందుల రాజశేఖరరెడ్డి, తన బావ చిన్నసుబ్బారెడ్డి, బాలకృష్ణ కారణం. ఇదే నా మరణ వాంగ్మూలం' అని లేఖలో రాసి ఉంది.

ఈదురుగాలుల బీభత్సం

- అకాల వర్షానికి వందల ఎకరాల్లో నేలకొరిగిన బొప్పాయి
- పంట చేతికొచ్చే సమయంలో నేలకొరగడంతో రైతుల కన్నీరుమున్నీరు

సాక్షి నెట్‌వర్క్:


పొదిలి మండలం కుంచేపల్లిలో అకాల వర్షానికి దెబ్బతిన్న బొప్పాయి

జిల్లాలో గురువారం కురిసిన అకాల వర్షం బొప్పాయి రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. ఈదురుగాలులతో కురిసిన వర్షానికి జిల్లాలోని దర్శి, కురిచేడు, పొదిలి మండలాల్లో ఎక్కువ నష్టం వాటిల్లింది. వందల ఎకరాల్లో బొప్పాయి చెట్లు నేలకొరిగాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

- దర్శి మండలంలోని చందలూరు, వెంకటచలంపల్లి, మారెడ్డిపల్లి, బసిరెడ్డిపల్లి, అబ్బాయిపాలెం గ్రామాల్లో బొప్పాయి తోటలు నేలకొరిగాయి. మండలంలో సుమారు 50 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశారు. ఆరుగాలం పండించిన పంట కళ్లెదుటే నేలపాలు కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షానికి కల్లాలో ఉన్న మిరపకాయలు, పందిర్లలో ఉన్న పొగాకు కూడా తడిసి ముద్దయింది. మండలంలోని జముకులదిన్నె గ్రామం వద్ద భారీ వృక్షం నేలకూలింది. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.
- పొదిలి మండలంలో అకాల వర్షం రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. మండలంలోని చిదంబరంపల్లి, గొల్లపల్లి, కుంచేపల్లి, మల్లవరం గ్రామాల్లో చేతికి వచ్చిన బొప్పాయి నేలకొరిగింది. పంట బాగా పండి మంచి కాయలతో కళకళలాడుతున్న సమయంలో అకాల వర్షం తీరని నష్టం మిగిల్చిందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. మండలంలో సుమారు 140 ఎకరాల్లో బొప్పాయి సాగు చేయగా 90 ఎకరాల్లో పూర్తిగా దెబ్బతింది. ఎకరాకు రూ.2 లక్షల మేరు నష్టం వాటిల్లిందని రైతులు బొనముక్కల రామిరెడ్డి, మారం సుబ్బారెడ్డి, సింగంరెడ్డి పెద్దిరెడ్డి, కామిరెడ్డి వెంకటరామిరెడ్డి, పెద్దిరాజు, వెంకటరెడ్డి వాపోయారు.
- పొదిలి మండలం రామాపురం జగనన్న కాలనీ సమీపంలో విద్యుత్ స్తంభంపై పిడుగు పడింది. పిడుగు విద్యుత్ పోలుపై పడటంతో పోలు పైభాగం విరిగికిందపడింది. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.
- కురిచేడు మండలం బోదనంపాడులో గురువారం సాయంత్రం వీచిన పెనుగాలులకు వేపచెట్టు రోడ్డుపై విరిగి పడింది. దీంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది.
- పొదిలి పట్టణంలో గురువారం సాయంత్రం వీచిన గాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.


పిడుగుపాటుకు తీగలతో సహా విరిగిపడిన విద్యుత్ స్తంభం

స్థానిక పెద్ద బస్టాండ్ సెంటర్‌లో విద్యుత్ స్తంభం ఎల్‌జీ షోరూంపై పడింది. స్థానిక ఎస్‌పీ పంప్ హౌస్‌లో పెద్ద వేపచెట్టు నేలకొరిగింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.


దర్శిలో అకాల వర్షానికి విరిగిపడిపోయిన బొప్పాయి చెట్లు


దర్శి: జముకులదిన్నెలో ఈదురుగాలులకు రోడ్డుకు అడ్డంగా పడ్డ భారీ వృక్షం


పొదిలిలో దుకాణంపై పడిన విద్యుత్ స్తంభం

జగనన్నతోనే పేదలకు న్యాయం

- వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ, చుండూరి రవిబాబు, దుంపా చెంచిరెడ్డి తదితరులు

సంతనూతలపాడు: పేదలకు న్యాయం జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుమ్మలంపాడులో ప్రసన్నాంజనేయస్వామి 60వ వార్షిక మహోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఇన్‌చార్జి చుండూరు రవిబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలు దుంపా రమణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రభలపై బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే నాయకులు ఇద్దరేనన్నారు. ఒకరు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాగా, రెండో వ్యక్తి ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జగనన్న పాలనలో అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాయన్నారు. ప్రభుత్వ సేవలను గ్రామస్థాయిలో అందించేందుకు సచివాలయ వ్యవస్థ రూపకల్పన చేశారని కొనియాడారు. మా కుటుంబంపై ప్రేమ, నమ్మకంతో నా తల్లికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా, నాకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా జగనన్న అవకాశం కల్పించారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేసి మళ్లీ జగనన్ను సీఎం చేసుకునేందుకు అందరూ కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఒంగోలు ఇన్‌చార్జి చుండూరు రవిబాబు మాట్లాడుతూ 10 నెలల కూటమి ప్రభుత్వ పాలనను చూసి ప్రజలు తప్పు చేశామని బాధపడుతున్నారన్నారు. అందరం కలిసికట్టుగా ముందుకు సాగి వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకువద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, బొక్కిసం శివరామయ్య, మొలకలపల్లి సుబ్బారావు, బొడ్డపాటి ఆంజనేయులు, బొడ్డపాటి శ్రీనివాసరావు, మంగపాటి శ్రీనివాసరావు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ,

చేబ్రోలు కిరణ్‌ను కఠినంగా శిక్షించాలి


ఒంగోలులో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఒంగోలు టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నియోజకవర్గ ఇన్‌చార్జి బడుగు ఇందిర ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వీడియో చిత్రీకరించిన పాయింట్ బ్లాక్ టీవీతో పాటుగా ఇంటర్వ్యూ చేసిన వ్యక్తి, ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ ఒక ప్రణాళిక ప్రకారమే అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. సమాజంలో గౌరవనీయంగా బతికే నాయకులను, వారి కుటుంబసభ్యులను అవమానించడమే లక్ష్యంగా వీడియోలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు భూమిరెడ్డి రమణమ్మ, లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ధర్మాసి హరిబాబు, సమాచార హక్కు విభాగం అధ్యక్షుడు కె. శేషాద్రిరెడ్డి, న్యాయవాది గాయం సావిత్రి, బి.నాగమల్లేశ్వరరెడ్డి, పార్టీ మహిళా విభాగం నాయకురాలు షేక్ అఫ్సర్, బత్తుల ప్రమీల, మాధవి, జ్యోతి, మేరి, వాణి, ప్రసన్న, రాజేశ్వరి పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌ను కఠినంగా శిక్షించాలని పార్టీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి కె.ఓబులరెడ్డి, మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు ఒ.సుబ్బారెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాసులు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు పి.రాములు నాయక్, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాష, సర్పంచ్‌లు బి.అరుణాబాయి, కె.వెంకటేశ్వరరెడ్డి, ఆర్.వెంకటయ్య, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, టి.రాంబాబు, కె.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.


యర్రగొండపాలెంలో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈడీ అర్జున్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 1305 యూనిట్లు కేటాయించినట్లు వెల్లడించారు. జిల్లాలో 21 నుంచి 50 ఏళ్లలోపు వయసున్న ఎస్సీలు అర్హులని స్పష్టం చేశారు. ఈ నెల 13 నుంచి మే 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కారు డ్రైవర్ దారుణ హత్య

- మృతదేహాన్ని చెత్తకుప్పల్లో పడేసిన నిందితులు
- పోలీసుల అదుపులో నిందితులు
- మృతుడిది పామూరు మండలం తిరిగలదిన్నె


వాసు మృతదేహం

నెల్లూరు(క్రైమ్): కారు డ్రైవర్ దారుణ హత్యకు గురైన ఘటన నెల్లూరు ప్రగతినగర్ ఏ-బ్లాక్‌లో గురువారం వెలుగుచూసింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా పామూరు మండలం తిరిగలదిన్నె గ్రామానికి చెందిన మాధవ, జ్యోతి దంపతులకు వాసు (23), వాసవి సంతానం. మాధవ కుటుంబం సుమారు 11 సంవత్సరాల క్రితం నెల్లూరు నగరానికి వలసొచ్చింది. వారు ప్రస్తుతం ప్రగతినగర్ ఏ-బ్లాక్‌లో నివాసం ఉంటున్నారు. మాధవ ఓ ప్రైవేట్ హాస్పిటల్లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. వాసు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. పలువురితో అతడికి గొడవలున్నాయి.

హత్య చేశారిలా..

పని ఉందంటూ వాసు బుధవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి ఏడు గంటల సమయంలో తండ్రికి ఫోన్ చేసి పనిమీద ఉన్నానని ఇంటికి రావడం ఆలస్యమవుతందని చెప్పాడు. అర్ధరాత్రి ఓ యువకుడిపై వాసు కత్తితో దాడి చేశాడు. సదరు యువకుడు ఈ విషయాన్ని అప్పటికే వాసు వల్ల ఇబ్బందులు పడుతున్న వినయ్, మణికంఠ, లోకేశ్ అలియాస్ ఛత్రపతి, తేజ, సంతోష్‌తోపాటు మరికొందరికి తెలియజేశాడు. అందరూ కలిసి వాసును ఆర్టీసీ బస్టాండ్ వద్ద పట్టుకుని ప్రగతినగర్ ఏ-బ్లాక్ పదో వీధిలోని దర్గా వద్దకు తీసుకొచ్చి దాడి చేశారు. తమ వెంట తెచ్చుకున్న కత్తులతో విచక్షణారహితంగా పొడిచి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని వెంగళరావ్‌నగర్ సమీప చెరువులో పూడ్చిపెట్టేందుకు తీసుకెళ్లగా అక్కడ జనసంచారం ఉండటంతో ప్రగతినగర్ చెరువు సమీపంలోని చెత్తకుప్పలో పడేశారు. మృతదేహంపై పెద్ద చెత్తమూటను వేసి పరారయ్యారు. గురువారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గమనించి దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించారు. నగర డీఎస్పీ పి.సింధుప్రియ, ఎస్సై రోశయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి ఛాతి, పొట్ట, గొంతు ఇలా అనేక చోట్ల పెద్ద సంఖ్యలో కత్తిపోట్లు ఉన్నాయి. పేగులు సైతం బయటకు వచ్చాయి. విగతజీవిగా పడి ఉన్న కుమారుడిని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. సాంకేతికత ఆధారంగా నిందితుల్లో కొందరిని పోలీసులు గుర్తించారు. మూడు నెలల క్రితం సారాయంగడి సెంటర్‌లో ఓ స్వీట్ షాపు వద్ద జరిగిన వివాదం కూడా హత్యకు మరో కారణంగా తెలుస్తోంది. పరారీలో ఉన్న మరికొందరు నిందితుల్లో ఓ రౌడీషీటర్ ఉన్నట్లు సమాచారం.

నమో.. చెన్నకేశవా..

- నేటి నుంచి 29వ తేదీ వరకు శ్రీలక్ష్మీ చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు


శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ వ్యూ

మార్కాపురం టౌన్: దక్షిణ భారతదేశంలో ప్రత్యేకతను సంతరించుకున్న వైష్ణవ క్షేత్రాల్లో ఒకటైన మార్కాపురం శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. 7 శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన ఈ దేవాలయంలో చైత్రశుద్ధ పౌర్ణమి రోజున ధ్వజారోహణతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించడం ఆనవాయితీ. శ్రీపాంచరాత్రాగమశాస్త్ర ప్రకారం 14 రోజులపాటు అత్యంత వైభవంగా సాగే ఈ ఆధ్యాత్మిక వేడుక భక్తులకు ఓ మరుపురాని కానుక. ఆలయంలో అబ్బురపరిచే శిల్ప సంపద విజయనగర చక్రవర్తుల కళాతృష్ణకు తార్కాణంగా నిలుస్తుంది.

బ్రహ్మోత్సవాలు ఇలా..

శుక్రవారం అంకురార్పణ, శనివారం ఉదయం ధ్వజారోహణం, రాత్రికి రాయబారం, ఎదురుకోలు, సూర్యవాహనం, స్వామి వారి కల్యాణం(తెల్లవారితే ఆదివారం), 13న చంద్రవాహనం, 14న సింహ, 15న శేష, 16న వ్యాళి, 17వ తేదీ నుంచి పగలు ఉత్సవంగా పొన్న, 18న హనుమంత, 19న గరుడ, 20న గజ వాహనం, 21న సాయంత్రం 4.30 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నారు. 22న అశ్వవాహనం, 23న హంస వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 28న స్వామివారికి వసంతోత్సవం, ఊంజల్ సేవ, 29న 16 రోజుల పండగ నిర్వహించనున్నారు.

ఉత్సవ ఏర్పాట్లు పూర్తి

శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. మార్కాపురంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్వామి వారిని దర్శించుకునే విధంగా ప్రణాళిక రూపొందించాం.

– శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈఓ

బాండెడ్ లేబర్ వ్యవస్థను నిర్మూలించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలు


ఈ-శ్రమ్ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో బాండెడ్ లేబర్ వ్యవస్థను పూర్తి స్థాయిలో నిర్మూలించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో బాండెడ్ లేబర్ సిస్టం రద్దు యాక్ట్–1976పై అవగాహన కల్పించేందుకు అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లకు గురువారం ఉదయం కలెక్టర్ జిల్లా స్థాయిలో వర్క్ షాప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు బాండెడ్ లేబర్ వ్యవస్థ నుంచి విముక్తి కాబడిన వారికి పునరావాసం కల్పించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేయాలన్నారు. కొత్తపట్నం మండలంలోని అల్లూరు, ఈతముక్కల గ్రామాలకు చెందిన ఏడు కుటుంబాలతో పల్నాడు జిల్లాలో వెట్టిచాకిరి చేయిస్తుండగా రెస్క్యూ చేసి రక్షించినట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలతో బలవంతంగా పని చేయిస్తున్నట్లు అధికారుల దృష్టికి రావడంతో వేగంగా స్పందించి వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించడంతోపాటు రిలీఫ్ సర్టిఫికెట్లు అందజేశామన్నారు. దాంతో పాటు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం కూడా ఇప్పించినట్లు చెప్పారు. వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించిన ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, కొత్తపట్నం తహసీల్దార్‌ను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు.

తొలుత ఇంటర్‌నేషనల్ జస్టిస్ మిషన్ (ఐజేఎం) ప్రతినిధి ప్రియాంక బాండెడ్ లేబర్ సిస్టం రద్దు యాక్ట్–1976 గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అన్ని శాఖల అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఈ – శ్రమ్ పోర్టల్‌లో ప్లాట్‌ఫాం కార్మికులు, గిగ్ కార్మికుల సమీకరణ, పేర్ల నమోదుపై అవగాహన కోసం కార్మిక శాఖ రూపొందించిన వాల్ స్టిక్కర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.